## మరో ఏడు దశాబ్దాలు నిలిచేలా నిర్మించాలి





వివరాలు మెయిన్‌లో...


# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం 22 | ఫిబ్రవరి, 2026 | పేజీలు :06


## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్ పూర్ :** పేదల సొంత ఇంటి కళను సాకారం చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.చిల్పూర్ మండలం శ్రీపతిపల్లి లో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. అనంతరం ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలోనే నిరుపేద ప్రజల సొంత ఇంటి కల వాస్తవ రూపం దాలుస్తున్నాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22వేల 500కోట్ల రూపాయలతో 4లక్షల 50వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. అందులో భాగంగానే స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని, కొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహప్రవేశం జరుగుతుండగా మరి కొన్ని వివిధ నిర్మాణ దశల్లో ఉన్నట్లు తెలిపారు. 85శాతం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించి ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందని వెల్లడించారు. నిరుపేద ప్రజలు ఆత్మ గౌరవంతో జీవించే విధంగా ప్రభుత్వం అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నదని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి మరొక 3,500 ఇందిరమ్మ ఇల్లు రాబోతున్నాయని తెలిపారు. ఈసారి ప్రభుత్వం లబ్ధిదారులకు కొన్ని వెసులుబాటులు కల్పించిందని అందులో అనుమతులు రాకముందే బేస్మెట్ కట్టుకున్న వాళ్లకు, గతంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయి బేస్మెట్ వరకే నిర్మాణం చేసుకున్న వారికీ సైతం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు అందుకు సంబందించిన జీవో నెంబర్ 96ను కూడా నిన్ననే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని వెల్లడించారు. గతంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయి బేస్మెట్ లెవల్ కట్టుకున్న వారికీ 4లక్షలు, రూఫ్ లెవల్ నిర్మాణం అయిన ఇంటికి 3లక్షల ఆర్థిక సహాయం అందించే విధంగా వెసులుబాటు కల్పించిందని తెలిపారు. రానున్న మూడేళ్లలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, స్థానిక మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు మెయిన్‌లో...

## పీడిత వర్గాల సమానత్వం కోసం సంత్ సేవాలాల్ కృషి స్ఫూర్తిదాయకం

## ప్రణాళికాబద్ధంగా పది పరీక్షలు నిర్వహించాలి




కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం మెదక్ :** జిల్లాలో జరిగే పదవ తరగతి పరీక్షలు పకడ్బందీ ప్రణాళికతో నిర్వహించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పదవ తరగతి పరీక్షలు నిర్వహంచే చీఫ్ సూపరెండెంట్, డిపార్ట్మెంటల్ అధికారులకు శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్టోరేజ్ పాయింట్ నుండి పరీక్ష కేంద్రానికి ప్రశ్న పత్రాలు తీసుకుపోయే సమయంలో జాగ్రత్తలు వహించి పరీక్ష కేంద్రానికి చేరవేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ సమయంలో ప్రతి విద్యార్థిని తనిఖీ నిర్వహించిన అనంతరం పరీక్ష కేంద్రంలోనికి పంపించాలని తెలిపారు. ప్రతి పరీక్ష, పరీక్షకు సమయం ఎక్కువగా ఉన్నందున మరుసటి రోజు వచ్చే పరీక్షకు విద్యార్థులను పూర్తి స్థాయిలో సంసిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా విద్యాశాఖ అధికారి కరుణావర్, జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజిరెడ్డి, మండల విద్యాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## "రైతుబడి అగ్రి షో"లో భూపాలపల్లి రైతుల సందర్శన



వివరాలు మెయిన్‌లో...

# మహోన్నత ఆశయానికి నాంది పలికిన కారల్ మార్క్స్, ఫెడరిక్ ఎంగిల్స్

## రెడ్ బుక్ డే కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :**1848 ఫిబ్రవరి 21 కమ్యూనిస్టు ప్రణాళిక పుస్తకంతో ప్రపంచాన్ని మార్చాలి అనే మహోన్నత ఆశయానికి నాంది పలికారు కారల్ మార్క్స్, పెడిరిక్ ఎంగిల్స్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. రెడ్ బుక్ డే సందర్భంగా శనివారం సిపిఎం హనుమకొండ జిల్లా కార్యాలయంలో సామూహిక పుస్తక పఠనం జరిగింది. ఈ పఠనంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. 1848 ఫిబ్రవరి 21 కమ్యూనిస్టు ప్రణాళిక ఒక పుస్తకం ప్రపంచాన్ని మార్చాలి అనే మహోన్నత ఆశయానికి కారల్ మార్క్స్, పెడిరిక్ ఎంగిల్స్ నాంది పలికారన్నారు. కారల్ మార్క్స్ ,ఎంగిల్స్ మనకు ఒక సిద్ధాంతాన్ని మాత్రమే ఇవ్వలేదని, ఆ వెలుగులో ఈ ప్రపంచాన్ని గమనించే చూపునిచ్చారని,దాని అర్థం చేసుకోవడానికి కావలసిన ఒక ఆలోచన పద్ధతిని ఇచ్చారని, అదే సమయంలో ప్రపంచాన్ని మార్చాలనే కర్తవ్యాన్ని కూడా ఇచ్చారని, సంపద పెరుగుతుందే తప్ప సమానంగా పంచ పడుతుందా అని అన్నారు. సంపద ఇప్పటికి కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం అయిందని ఫలితంగా కార్పోరేట్ శక్తులు ప్రభుత్వాల కంటే బలంగా మారుతున్నారు అని అన్నారు. ప్రజాస్వామ్యం మార్కెట్ కు బానిస అవుతుందనీ విమర్శించారు. అందుకే రెడ్ బుక్ డే అంటే కేవలం ఒక రాజకీయ జ్ఞాపకం చారిత్రక స్మరణ మాత్రమే కాదు అది మానవాళి శ్రేయస్సుకై కమ్యూనిస్టు ప్రణాళిక రూపంలో ఒక శాస్త్రీయ భావజాలం ఆవిర్భవించిన రోజు అని, రాబోయే కాలంలో బరితెగించిన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో కార్యకర్తలంతా పోరాటంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ పుస్తక పఠనం కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు సారంపెల్లి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చుక్కయ్య, రాగుల రమేష్, జిల్లా కమిటీ సభ్యులు గొడుగు వెంకట్, డి.తిరుపతి, ఎం.రవి, నాయకులు ఎం.నారాయణ, ఎం.రమాదేవి, కే.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి స్థలాల కేటాయింపుపై హర్షం

**ప్రజాపక్షం/నల్లబెల్లి :**తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఇంటి స్థలాలు కేటాయించడంతో హర్షం వ్యక్తం చేస్తు సిఎం రేవంత్‌రెడ్డి ,మంత్రి పొన్నం ప్రభాకర్ ,కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ,నర్సంపేట ఎంఎల్‌ఎ దొంతి మాధవరెడ్డి ,ప్రొపెసర్ కోదాండరాం చిత్ర పటాలకు పటాలకు పాలాబీ షేకం చేశారు . శనివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ అవరణలో తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించి సిఎం రేవంతరెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్నాప్పుడే తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇచ్చి అధుకుంటామని మాట ఇచ్చారని చెప్పారు . ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేవంత్‌రెడ్డికి తెలంగాణ ఉద్యమకారులు రుణపడి ఉన్నామన్నారు . ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ఆకుల సాంబరావు ,బట్టు సాంబయ్య ,నర్సయ్య ,కొత్తగట్టు ప్రబాకర్ ,తంగెళ్ల వేణు ,మామిండ్ల అయిలయ్య ,చిన్న అయిలయ్య ,వేముల రాజు తదితరులు పాల్గొన్నారు .

పూసురు గ్రామంలో పుష్కరఘాట్ నిర్మాణం చేయాలి

# వాజేడు ఎంపిడిఒకి వినతిపత్రం అందజేత

**ప్రజాపక్షం/వాజేడు:**రాబోయే 2027 సంవత్సరంలో వచ్చే గోదావరి పుష్కరాలను పూసుర్ గ్రామం నందు పుష్కర ఘాట్ ఏర్పాటు చేయాలని వాజేడు మండల ప్రజాపరిషత్ అధికారి మల్లం విజయకు పూసురు సర్పంచ్ దబ్బకట్ల సుమన్ వినతిపత్రాన్ని శనివారం అందజేశారు.పూసురు గ్రామ సరిహద్దు నుండి గోదావరి నది ప్రవాహం ఉండటం వలన వర్ష కాలం,ఎండాకాలం కూడా పూసురు గ్రామ దరి ఒడ్డు వెంటనే నీరు ఉంటుంది. కాబట్టి పుష్కర ఘాట్ ఏర్పాటు చేయటం వలన ప్రజలకు భక్తులకు నిరంతరం ఉపయోగపడుతుంది. పూసురు గ్రామంలోని గోదావరి నది దరి వెంట పుష్కర ఘాట్ నిర్మాణం చేయాలని ప్రభుత్వానికి సర్వే చేసి తగిన ప్రతి పాదనలు ప్రభుత్వానికి పంపించాలని వాజేడు ఎంపీడీఓ ని సర్పంచ్ దబ్బకట్ల సుమన్ కోరారు. ఆయన వెంట పూసురు గ్రామస్థులు బడే.సన్మాకరావు, కవిరి చందరావు, తల్లడి నానబాబు పాల్గొన్నారు.

# మృత భాష కాకూడదు..అమృత భాష కావాలి

## తెలుగు భాష ఉపాధ్యాయుడు పల్లె శ్రీనివాస్

**ప్రజాపక్షం/నడికూడ:** నడికూడ మండలం చర్లపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పల్లె శ్రీనివాస్ తెలుగు భాషా ఉపాధ్యాయులు విచ్చేసి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21ను అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని, బహుభాషా తనాన్ని,భాష సాంస్కృతిక భిన్నత్వాన్ని గుర్తించేందుకు, అవగాహన పొందేందుకు జరుపుకుంటారని,అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21 న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించాలని 1999 నవంబరు 17న యునెస్కో ప్రకటించిందని, 2000 సంవత్సరం నుంచి ప్రతి ఏటా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నామని,ప్రపంచంలో చిన్న,పెద్ద భాషలన్నిటినీ రక్షించుకోవాలని,భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతోందని అంతేకాకుండా మాతృభాష మృత భాష కాకూడదని అమృత భాష కావాలని తెలిపారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్,ఉపాధ్యాయ బృందం పల్లె శ్రీనివాస్ ను శాలువా పుష్పగుచ్చంతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లకావత్ దేవ,కంచ రాజకుమార్,పుల్లూరి రామకృష్ణ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# శాలపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దడమే లక్ష్యం



**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలంలోని శాలపల్లి గ్రామాన్ని తీర్చి దిద్దడమే నాలక్ష్యమని గ్రామసర్పంచ్ కూరపాటి అశోక్ అన్నారు.శనివారం వేలేరు మండలంలోని శాలపల్లి గ్రామంలో ఆదర్శగ్రామైక్య మహిళా సంఘం అధ్యక్షురాలు లావణ్య ఆద్వర్యంలో మహిళా భవన నిర్మాణంతో పాటుగా అంగన్ వాడీ కేంద్రానికి శంకుస్థాపన చేసి మాట్లాడుతూ హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని శాలపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసుకొని 103 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా 50 ఇండ్లు పూర్తిగా నిర్మాణం కాగా మిగతా అసంపూర్తిగా ఉన్న త్వరలోనే పూర్తి చేయడానికి ప్రయత్నిస్తానని ఇంకా గ్రామంలో ఎవరైనా ఇందిరమ్మ లబ్ది దారులు ఉంటే వారికి త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడానికి స్టేషన్‌ఘన్‌పూర్ ఎంఎల్‌ఎ తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి సిద్దంగా ఉన్నారని,ఎంఎల్‌ఎ కడియం శ్రీహరి సహాయసహకారాలతో శాలపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.కార్యక్రమంలో పిఆర్ఎఇ రూపావతి,ఎపిఎం సునిత,ఎపిఒ విజయ,గ్రామ పంచాయితీ కార్యదర్శి లక్ష్మ ణ్,మండలసమాఖ్యఅధ్యక్షురాలు ఆల్ల రేణుక,గ్రామపసర్పంచ్ ఎర్రగొల్ల రమేష్,విఒ అధ్యక్షురాలు లావణ్య,స్వరూప,కూరపాటి రమేష్,బిజెపి మండలపార్టీ అధ్యక్షుడు కాత్రేవుల రాజుయాదవ్,మండల కొమురయ్య,ఆదరి చినవెంకన్న,బండిచిలుక రాజు,తాటిపాముల రవిందర్,దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తాయో టిఎస్ 541సీడ్ మిర్చితో రైతులకు అధిక లాభాలు

## సేల్స్ మేనేజర్ చెన్న శ్రీధర్




**ప్రజాపక్షం/మంగపేట:**మిరప పంట సాగు చేసే రైతులు తాయో సీడ్స్ టిఎస్ 541 సీడ్ మిరప తో అధిక లాభాలుంటాయని సేల్స్ మేనేజర్ చెన్న శ్రీధర్ అన్నారు శనివారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 150 మంది మిర్చి రైతులతో తాయో సీడ్స్ మేనేజర్ శ్రీధర్ చందన సీడ్ రాయల్ చంద్రశేఖర్ అధ్యర్యంలో మల్లూరులో రైతు కుంచనపల్లి అశోక్ సాగు చేస్తున్న తాయో టిఎస్ 541మిరప తోటలో క్షేత్ర స్థాయిలో సందర్శన నిర్వహించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సేల్స్ మేనేజర్ చెన్న శ్రీధర్ సమాధానాలు ఇచ్చి పలు సూచనలు చేశారు తాయో 541టిఎస్ మిర్చి పొడవైనా కాయలు చెట్టు నిండా కాయలు కొసలకు కూడా కాయలు కాస్తాయి మిరప కాయ కలర్ బాగా వస్తుంది. తెగుళ్లను వైరస్ లను తట్టుకొని అధిక దిగుబడి వచ్చి రైతులకు లాభం చేకూరుతుంది అని చెన్న శ్రీధర్ రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం కుంచనపల్లి అశోక్ ను రైతుల సమక్షంలో సీడ్స్ కంపెనీ సంస్థ సన్మానం చేశారు.

# నేడు పదవీ బాధ్యతలు చేపట్టనున్న చైర్మన్, వైస్ చైర్మన్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**మున్సిపల్ కార్యాలయంలో నేడు (ఆదివారం) మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ లు పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. ఆదివారం రోజున ఉదయం 10 గంటలకు భూపాల పల్లి హనుమాన్ టెంపుల్ నుండి మున్సిపల్ ఆఫీస్ వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం మున్సిపల్ ఆఫీస్ లో పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. భూపాలపల్లి జిల్లాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, కార్యకర్తలు, పట్టణ కమిటీ కాంగ్రెస్ నాయకులు, మండల అధ్యక్షులు, జిల్లా కమిటీ, ముఖ్య కార్యకర్తలు అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ లు పిలుపునిచ్చారు.

# సమన్వయంతోనే బాలల హక్కుల పరిరక్షణ

## హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం



**ప్రజాపక్షం/హనుమకొండ :** బాలల హక్కుల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం రోజున హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ , విద్యా, వైద్యారోగ్య, కార్మిక, పోలీస్ శాఖల అధికారులు, బాలల న్యాయ మండలి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ తో నిర్వహించిన సమీక్షా సమావేశాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా శుక్రవారం కమిషన్ సందర్శనలో అనేక సమస్యలు గుర్తించామని ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని, హనుమకొండ, వరంగల్ డీఈవోలు సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో గర్భిణీలు, బాలింతలు, ఇమ్యూనైజేషన్ స్టేటస్ వివరాలను అందించాలని హనుమకొండ డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్యను ఆదేశించారు. బాలల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. అదే విధంగా బాల్య వివాహాలు చేసే కుటుంబాలను ముందుగానే గుర్తించి వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని, బాల్య వివాహాలపై నివేదికను అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారులకు తెలియజేశారు. త్వరలో బాల్య వివాహ నిషేధ చట్టంపై, బాల్య వివాహాల నిర్మూలనపై, పోక్సో చట్టం పై పెద్ద ఎత్తున అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో బాలల కోసం ప్రత్యేకంగా స్టూడెంట్ వెల్నెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీని ద్వారా వారి మానసిక వికాస స్థాయిలను గుర్తించి అవసరమైన వారికి ఆత్మ స్థైర్యాన్ని కల్పించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బాలల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బాలల పరిరక్షణ కమిషన్ సభ్యులు బృందాలుగా మూడు జిల్లాల్లో పర్యటించిన సందర్భంగా వారు గుర్తించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. బాలల పరిరక్షణ కమిటీ చైర్పర్సన్ సీతా దయాకర్ రెడ్డికి జిల్లా కలెక్టర్ జ్ఞాపికను అందజేశారు.ఈ సమీక్షా సమావేశంలో కమిషన్ సభ్యులు మరిపల్లి చందన, బండి అపర్ణ, కంచర్ల వందన గౌడ్, వచన్ కుమార్, ప్రేమలత అగర్వాల్, డీఆర్వో వైవీ గణేష్, ఆర్జేడీ ఝాన్సీ లక్ష్మీ బాయి , జిల్లా సంక్షేమ అధికారులు విశ్వజ, మల్లీశ్వరి, డిఎంహెచ్వోలు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, అడిషనల్ డీసీపీ ఎన్ రవి, భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ నరేష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ లు అనిల్ చందర్ రావు, వసుధ, బాలల న్యాయ మండలి సభ్యులు డాక్టర్ కే గోపికా రాణి, ఎం సుభాష్, ఇంచార్జి డిసిపివోలు ఎస్ ప్రవీణ్ కుమార్, ఉమ, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ భాస్కర్, జి తిరుపతి, కార్మిక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంధ పాఠశాల విద్యార్థులకు లక్ష రూపాయల విరాళం




**ప్రజాపక్షం/ నర్సంపేట:** హైదరాబాదులోని సోచ్ ఫౌండేషన్ వారి ఇట్రాడో అంధుల పాఠశాలకు విజ్ డమ్ హై స్కూల్ విద్యార్థులు రూ. 1.13 లక్షల విరాళాన్ని అందజేసినట్లు పాఠశాల డైరెక్టర్ జావేద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సోచ్ ఫౌండేషన్ ప్రతినిధి మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ తాము గుడ్డి వారిని ఆదరిస్తూ తమ పాఠశాలలో వారికి బ్రెయిలీలిపి తో పాటు, క్రీడలు, సంగీతం, నాట్య కళల్లో శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించడం గర్వనీయం. సమాజంలో పుట్టు గుడ్డి వారు నిరాదరణకు గురవడం మనకు తెలిసిందే. కానీ వారిని మేము అక్కున చేర్చుకుని వారిలోని నైపుణ్యతను గుర్తించి వారికి తర్ఫీదును ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేవుడిచ్చిన అందమైన కళ్ల దెబ్బతినడంతో విద్యార్థులు చూపును కోల్పోవడం బాధ కలిగిస్తుందన్నారు. దీనికి కారణం తల్లిదండ్రులు తమ ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు భోజనం చేస్తున్న సమయంలో ఏడవకుండా మొబైల్ ఫోన్లను అత్యధికంగా ఇవ్వడమే ప్రధాన కారణంగా తెలియజేశారు. తర్వాత 6 నుండి 15 సంవత్సరాలలోపు విద్యార్థులు ఆటపాటల్లో కాకుండా ఫోన్లతో కాలక్షేపం చేయడం, వాటిలో క్రీడలు తదితర విషయాలను అధికంగా చూడడం ప్రధాన కారణంగా తెలియజేశారు. ఫోన్లను, టీవీలను పిల్లలు అధికంగా చూడడం వలన కంటిలోని రెటీనా క్షీణించి, కంటి నరాలు పాడయిపోయి శాశ్వతంగా చూపు కోల్పోతుందన్నారు. తమ పాఠశాలకు విజ్ డమ్ విద్యార్థులు రూ.1.13 లక్షల విరాళాన్ని సేకరించి అందించడం పట్ల వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జావేద్, కరస్పాండెంట్ జహంగీర్, అకాడమిక్ ఇన్‌చార్జి నాజియా ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ రియాజ్, రాజేష్, పృధ్వి, అరుణ, యాస్మిన్ లతోపాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేస్తా

## మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్



**ప్రజాపక్షం/ నర్సంపేట :** వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ అన్నారు. నర్సంపేట మున్సిపాలిటీలోని ఫిల్టర్ బెడ్, నల్లాల బావిని నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ నర్సంపేట ప్రజలకు వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చేయడమే తన లక్ష్యమని అందులో భాగంగానే నేడు ఫిల్టర్ బెడ్, నల్లాల బావులను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. మోటార్లను రిపేర్లు చేయించి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ వేసవిలో ఎటువంటి సమస్య లేకుండా నిత్యం నర్సంపేట ప్రజలకు నీటిని అందించడమే లక్ష్యంగా తమకు సిబ్బంది సహకరించి, తాగునీటి సమస్య రాకుండా పని చేయాలనికోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాట భాస్కర్, కౌన్సిలర్లు మాదాసి రవి, బీరం భరత్ రెడ్డి, నర్సంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, యూత్ కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# గూడూరు ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ల బహుకరణ

**ప్రజాపక్షం/పాలకుర్తి:** ఉన్నత పాఠశాలకు కంప్యూటర్లు అందించడం అభినందనీయమని గ్రామ సర్పంచ్ మాచర్ల స్వరూప పుల్లయ్య అన్నారు. శనివారం మండలంలోని గూడూరు ఉన్నత పాఠశాలకు ఇన్ఫోసిస్ కంపెనీ ఆధ్వర్యంలో కంప్యూటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మరింత అందిపుచ్చుకోవడానికి ఉపయోగపడే సాధనమైన కంప్యూటర్లు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులో ఉంటే పట్టణ ప్రాంత విద్యార్థులతో సమానంగా అన్ని రంగాలలో రాణించగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ కంపెనీ మేనేజర్ స్వాతి, సీఎస్ఆర్ నాగరాజు, హెచ్ఎం శైలజ, ఉప సర్పంచ్ కళ్యాణ్, ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.

# మాజీ జెడ్‌పిటిసి గుడి వంశీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండలం లోని నెల్లుట్ల గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద, శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, మాజీ జెడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి, బాణసంచా పేల్చి, ఆనందాన్ని వెలిబుచ్చారు. అనంతరం సర్పంచ్ నర్సింగ రామకృష్ణ మాట్లాడుతూ, మాజీ జెడ్పిటిసి గుడి వంశీ రెడ్డి, గత పది సంవత్సరాల నుండి, తన రాజకీయ జీవితంలో, గ్రామంలోని ప్రజలకు అందుబాటులో ఉండి, కష్టసుఖాల్లో పాలుపంచుకున్న వ్యక్తి వంశీధర్ రెడ్డి అని వారు భీమా వ్యక్తం చేశారు. మా గ్రామానికి సంబంధించిన కాల్వమానుమాతుల కోసం, ఆయన సొంత ఖర్చులతో 50 వేల రూపాయలు అందజేశారని, యువత మంచి కోసం, ఓపెన్ జిమ్ కోసం, 2,00,00 రూపాయలతో ఏర్పాటు చేశాడని, ముస్లిం సోదరులకు, శావ పేటిక కోసం 50వేల రూపాయలను, ఆర్థిక సాయం అందజేశారని వారు అన్నారు. మండలంలోని ప్రజలకు, వెన్న అంటూ తోడు ఉంటూ, అభివృద్ధి పథకంలో పాలుపంచుకుంటూ ముందుకు సాగుతున్నారని వారిని కొనియాడారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా, మండల పార్టీ తరఫున గ్రామ పార్టీ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు, బత్తిని అశోక్ కుమార్ గౌడ్, నర్సింగ రమేష్, గుర్రం బాలరాజు, ఆనంద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ పరిధిలోని దళితవార్డులను మోడల్ వార్డులుగా తీర్చిదిద్దుతాం



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట మున్సిపల్ పరిధిలోని దళితవార్డులను మోడల్ వార్డు లుగా తీర్చిదిద్దుతామని నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని 30 వార్డులో రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన సన్మాన కార్యక్రమంలో నూతనంగా చైర్ పర్సన్‌గాబాధ్యతలు స్వీకరించిన పెండెం లక్ష్మి రామానంద్,30వ వార్డు కౌన్సిలర్ మాదాసి రవి,మహిళా కౌన్సిలర్లు వేల్పుల శ్రీలత, బాణాల ప్రసన్న కుమారిలకు శాలువా, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ శ్రీలక్ష్మి రామానంద్ మాట్లాడుతూ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో మున్సిపాలిటి పరిధిలోని దళిత వార్డులను మోడల్ వార్డులుగా తీర్చిదిద్దుతానని , వేసవి కాలంలో తాగునీటి సమస్య లేకుండా చూస్తానని , వార్డులలో డ్రైనేజిలు, సిసి రోడ్లు, విద్యుత్తు సరఫరా, నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాటు చేస్తానని , అర్హులైన వారికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు పెండెం రామానంద్, నర్సంపేట కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు నాగెల్లి సారంగం , మాజీ వార్డ్ మెంబర్ కొయ్యడి సంపత్, సీనియర్ నాయకులు దూడల సాంబయ్య, గద్ద సంజీవ, గద్ద శ్రీనివాస్, గద్ద జ్యోతి, నూనె పద్మ, కోమటి సరోజన, జానకమ్మ, గద్ద అఖిల్, నూనె బన్ను, గద్ద నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండల కేంద్రానికి చెందిన బొమ్మర సంధ్యారాణి గత వారం రోజుల క్రితం చిల్పూర్ మండలంలోని నష్కల్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో మృతురాలికి ఓ కుమారుడు, కుమార్తె, చిన్న పిల్లలు ఉండడంతో జఫర్‌గడ్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మృతురాల కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి 50కేజీల బియ్యం, రూ.6వేలు నగదును మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. రాష్ట్ర నాయకులు చిటిమల్ల కృష్ణమూర్తి, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు అంచూరి యుగంధర్, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్, కోశాధికారి అశోక్, గ్రామశాఖ అధ్యక్షులు శ్రవణ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి పండ్లు తినడం ఎంతో మేలు

## తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్




**ప్రజాపక్షం/తొర్రూరు :** ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతీ రోజు తప్పనిసరిగా పండ్లు తినడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శనివారం ఫ్రూట్స్ డే ను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు 102 రకాల పండ్లను ప్రదర్శించారు. ఏ పండులో ఏ ప్రయోజనం దాగి ఉందో చార్టుల రూపంలో విద్యార్థులు ప్రదర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్‌తో కలిసి చైర్మన్ శ్రావణ్ మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారానికి దూరమవుతూ జంక్ ఫుడ్‌కు బానిస అవుతున్నారని అన్నారు. అనంతరం నూతన చైర్మన్ శ్రావణ్‌కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్‌లను పాఠశాల యాజమాన్యం సత్కరించారు. పాఠశాల డైరెక్టర్లు నాగిరెడ్డి, సంపత్, సునీత, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ఇమ్మడి రాంబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉమ్మడి గురుకులాల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** తెలంగాణ రాష్ట్రంలోని గురుకులాలలో ప్రవేశం కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జఫర్‌గడ్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలలో జనగామ, పాలకుర్తి, జఫర్గడ్, స్టేషన్‌ఘనపూర్ 2016 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి హాల్ టికెట్, పెన్, బ్లాక్ పెన్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

# ముల్కనూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారి ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్క నూర్ లో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కలెక్టర్ శ్రీమతి స్నేహ శబరీష్ సందర్శించారు. హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జనగామ ప్రభుత్వ వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండల ప్రజల కోసం స్థానిక మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు.మెగా వైద్య శిబిరంలో ఓపి నమోదు, ,ప్రాథమిక పరీక్షల కౌంటర్లను ,కలెక్టర్ పరిశీలించారు. జనరల్ ఫిజీషియన్ విభాగాలతోపాటు ఎముకలు, శస్త్ర చికిత్స, పిల్లలు, చెవి ముక్కు గొంతు, చర్మవ్యాధి, కంటి, స్త్రీ వైద్య నిపుణులు వైద్య సేవలను , ఈసీజీ ,ఎక్సరే పరీక్షలు నిర్వహిస్తుండగా కలెక్టర్ సందర్శించి ఆయా విభాగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే హాజరైన సర్పంచులను వారి వారి గ్రామాల నుండి ఎంతమంది ఏ సమస్యలతో రావడం జరిగిందో అడిగి తెలుసుకున్నారు.జనగామ వైద్య కళాశాల, జిల్లా ఆసుపత్రి జనగామకు చెందిన (8 )విభాగాల నుండి స్పెషలిస్ట్ వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో 14 మంది స్పెషలిస్ట్ వైద్యులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుండి డాక్టర్లు సూపర్వైజర్లు,ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ ఆఫీసర్లు , రేడియోగ్రాఫర్లుపారామెడికల్ సిబ్బంది , ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు మొత్తం 75మందిలపాల్గొన్నారు. అలాగే ప్రజలకు వివిధ ఆరోగ్య అంశాల పట్ల, ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికి బీపీ తో పాటు అవసరమైన వారికి షుగర్ , హిమోగ్లోబిన్ పరీక్షలను అక్కడే నిర్వహించగా ఇతర ల్యాబ్ పరీక్షలకు నమూనాలు సేకరించి తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ లో పరీక్షల నిమిత్తం పంపించారు. ప్రత్యేకంగా మొబైల్ ఎక్స్రే మరియు ఈసీజి ఏర్పాటు చేయడం జరిగింది.ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని , స్థానికంగా అందుతున్న వైద్యంతో పాటు, స్పెషలిస్ట్ వైద్య సేవలు అవసరం ఉండి పనుల ఒత్తిడి వల్ల అలాగే వైద్య పరీక్షలకుటెస్టులకు అదనంగా డబ్బులు వెచ్చించలేక పట్టణాలకు వెళ్లలేక పోతున్న వారి కోసం మండల కేంద్రంలో వారికి అందుబాటులో వైద్య సేవలు అందించాలని ఉద్దేశ్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో (310)మందికి ఒక్కరికి దాదాపుగా 1800 రూపాయల విలువైన ల్యాబ్ పరీక్షలు చేయడం జరిగింది.5 లక్షల పైగా విలువచేసే మందులను పంపిణీ చేయడం జరిగింది.

## బొలెరో ఢీకొని గాయాలు..

**ప్రజాపక్షం/నర్సింహులపేట:**నర్సింహుల పేట మండలంలోని జయపురం క్రాస్ రోడ్డు వద్ద బొలెరో వాహనం ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి.పోలీసుల వివరాల ప్రకారం దంతాలపల్లి మండలంలోని ఏపూరు గ్రామానికి చెందిన సతీష్ కుటుంబ సభ్యులతో కలసి జయపురం గ్రామంలో ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు.తిరుగు ప్రయాణంలో గ్రామానికి వెళ్తున్న క్రమంలో జయపురం క్రాస్ వద్ద గొర్రెల లోడుతో వస్తున్న బొలెరో ఢీకొట్టింది.దీంతో బైక్ పై ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.గమనించిన స్థానికులు 108వాహనానికి సమాచారం ఇవ్వడంతో గాయపడిన వారిని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు.

## గిరిజన మహిళా వార్డు సభ్యురాలికి అవమానం

**ప్రజాపక్షం/పంచాగూడూరు:**మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని మేజర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో గిరిజన మహిళా వార్డు సభ్యురాలిపై అవమానంగా వ్యవహరించిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామ సభ సమయంలో ఇతర వార్డు సభ్యులందరినీ ముందువరుసలో కూర్చోబెట్టిన పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్ పై చర్యలు తీసుకోవాలని ఎంపిడివో కు వినతిపత్రం అందజేశారు. 10 వ వార్డు గిరిజన మహిళా సభ్యురాలు గుగులోత్ వినోదను వెనుక వరుసలో కూర్చోబెట్టడం ద్వారా చిన్న చూపు చూపారని ఆరోపించారు. గిరిజన మహిళ అన్న విషయాన్ని విస్మరించి అవమానపరిచే రీతిలో ప్రవర్తించారని బిజెపి మండల నాయకులు విమర్శించారు. ఈఘటపై తక్షణమే స్పందించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి పై వెంగనే చర్యలు తీసుకొవాలని భారతీయ జనతా పార్టీ గూడూరు మండల శాఖ ఆధ్వర్యంలో ఫిర్యాదు అందజేశారు. ఈకార్యక్రమంలో గిరిజన మోర్చిరాష్ట్ర కార్యదర్శి రాంబాబు నాయక్ మండల అధ్యక్షుడు రసమల్ల వెంకటేశ్వర్లు పడాల నాగారాజు కోరే అనిల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హేమాచలునికి భక్తుడి కానుక

**ప్రజాపక్షం/మంగపేట:**మండలంలో అతి పురాతన ఆలయం మల్లూరు హేమచల కొండల్లో వెలసిన శ్రీ లక్ష్మి నృసింహ స్వామి చెంచు లక్ష్మి ఆదిలక్ష్మి అమ్మవార్లకు ఖమ్మం గ్రామానికి చెందిన డాక్టర్ సాయి విజయ్ చౌహాన్ తండ్రి భగవాన్ 30 గ్రాములు 876 మిల్లి గ్రాములు తూకము కలిగిన నాలుగు మంగళ సూత్రాలు రెండు గొట్టాలు నాలుగు బంగారు గుండ్లు వస్తువులుగా గలిగిన స్వచ్ఛమైన బంగారంతో చేయబడిన చెంచు లక్ష్మి ఆదిలక్ష్మి అమ్మవార్లకు మంగళ సూత్రాలను అలాగే 60 గ్రాముల తూకం కలిగిన వెండి గొలుసులతో సహా శనివారం రోజున ఆలయ మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు ముక్కామల రాజశేఖర్ శర్మ ఆలయ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ యర్రంగారి సురేష్ ఆలయ అర్చకులు సిబ్బంది ఉపస్థిత భక్తుల సమక్షమున దాతలు రిటైర్డ్ ఆలయ అర్చకులు కైంకర్యం రాఘవాచార్యలు ద్వారా ఆలయ కార్యనిర్వహణాధికారి రెవెల్లి మహేష్‌కి అందజేశారు.

# ప్రకృతి వ్యవసాయం చేసి ఆరోగ్యంగా ఉండాలి

కృషి విజ్ఞాన్ సంస్థ శాస్త్రవేత్త ప్రతాప్



**ప్రజాపక్షం/శివ్వంపేట:** సేంద్రియ వ్యవసాయం కోసం ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన్ శాస్త్రవేత్త ప్రతాప్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం కోసం సమిష్టిగా ఆలోచించి మన ఆరోగ్యం కొరకు నేల ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కు ప్రకృతి వ్యవసాయం చేసి ఆరోగ్యంగా ఉండాలని సూచించడం జరిగింది. రైతులు క్రిమి సంహారక మందులు వాడకుండా స్వయంగా రైతులే సేంద్రియ ఎరువులను తయారు చేసుకునే విధానాన్ని వివరించడం జరిగింది. ముఖ్యంగా మన ఇంటి వ్యర్థాలు, పరిసర ప్రాంతాలలో ఉండే వ్యర్థాలను సేకరించి వర్మి కంపోస్ట్ తయారు చేసుకొని పంటలకు వాడుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయంలో భాగంగా వర్మి కంపోస్ట్ అగ్ని హస్తం, బ్రహ్మాస్త్రం, వావిలాకు కషాయం, వేప నూనె, ఆవు మూత్రం, ఆవు పేడ నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసుకొని పంట పొలాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి లావణ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు నమోదు, యంత్ర పరికరాలు, యూరియా బుకింగ్ చేసుకోవడం గురించి అందరికి అవగాహన కలిగి ఉండాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రవికుమార్, వినీత, మౌనిక, రైతులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/మెదక్:** మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం ఫరీద్‌పూర్ గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. అధికంగా రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటోందని, భూమి సారం తగ్గిపోవడంతో పంటల దిగుబడులు తగ్గుతున్నాయని ఆయన తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని సూచించారు. జీవామృతం, ఘన జీవామృతం, వేస్ట్ డీకంపోజర్ వంటి సహజ పదార్థాలను వినియోగిస్తూ సాగు చేస్తే నేల సారం పెరిగి, మంచి దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు రైతుల ఆదాయం పెరుగుతుందని చెప్పారు. అనంతరం సీఆర్పీలు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి భార్గవ్, సీఆర్పీలు మౌనిక, మానస, నవనిత, సింధుజ, జీఆర్పీలు ప్రమోద్, యాదగిరి, నాయకులు రామకృష్ణ గౌడ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రాగిమాల్ట్ తిన్న ఆరుగురు విద్యార్థులకు అస్వస్థత



**ప్రజాపక్షం/రామాయంపేట:**పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగి మాల్ట్ తిన్న ఆరుగురు విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఈసంఘటన శనివారం రామాయంపేటలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే జిల్లా పరిషత్ బాలుర ఉన్న పాఠశాలలో చదువుతున్న విష్ణు, విజయ్, ప్రభాస్, చరణ్, సిద్ధు, అరవింద్‌లు మధ్యాహ్నం రాగిమాల్ట్ తాగి వాంతులు చేసుకోవడాన్ని గమనించిన పాఠశాల సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే వారిని సమీపంలోని సిహెచ్‌సికి తరలించి వైద్య చికిత్సలు నిర్వహించారు. ప్రస్తుతం అందరూ క్షేమంగా ఉన్నారు. ఈ ఘటనతో పాఠశాలలో కొద్దిసేపు ఆందోళన నెలకొన్నప్పటికి పరిస్థితి పూర్తిగా ప్రశాంతంగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. రాగిమాల్ట్ నాణ్యతపై పరిశీలించి, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి విజయ తెలిపారు. ఆమె వెంట తహశీల్దార్ రజనికుమారి, మండల విద్యాధికారి ఐత శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి



**ప్రజాపక్షం/రామాయంపేట:**పర్యావరణ పరిరక్షణ కోసం ఆకుపచ్చను పెంచడం కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నగరవన యోజన పథకం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి జోజి అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని అక్కన్నపేటలో జరుగుతున్న పనులను పరిశీలించారు. నగరవన యోజన పథకం ద్వారా జరుగుతున్న పనులను పూర్తి నాణ్యతగా చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా అమలవుతున్న ఈపథకం తెలంగాణలో కూడా అమలవుతుందన్నారు. అనంతరం ఆయన కొచ్చెరువును సందర్శించారు. చిత్తడి నేలల నిర్వహణ, జలాశయాల పరిసరాల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా చెరువు చుట్టూ ఆకుపచ్చను పెంచడం, ఇతర అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. నీటి వనరులను కాపాడు దిశగా ప్రయత్నాలు చేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో అటవీరేంజ్ అధికారి విద్యాసాగర్‌తో సర్పంచు ఐక్కయ్యగారి యాదగిరి ఉన్నారు.

## తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల సమావేశం

**ప్రజాపక్షం/నిజాంపేట:**వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని అందించాలని, టెలివిజన్, మొబైల్ ఫోన్ కు విద్యార్థులను దూరంగా ఉండేలా చూడాలని, విద్యార్థులు ఇంటి వద్ద చదువుకునే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాంపూర్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి హెచ్‌ఎం ఈశ్వరయ్య అన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు అర్జున్, సుకన్య, నరేష్, కుమారస్వామి, సయ్యద్ తల్లిదండ్రులు బాలలక్ష్మి, రేఖ, సౌందర్య, హమీద, శోభ ఏఎన్ఎం మమత తదితరులు పాల్గొన్నారు.

## అయోడైజ్డ్ ఉప్పుతో ఆరోగ్య ప్రయోజనాలు



**ప్రజాపక్షం/తొర్రూరు :** అయోడైజ్డ్ ఉప్పుతో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ కె.మానస అన్నారు. డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అయోడిన్ సాల్ట్ ఉపయోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినీ, విద్యార్థుల ముందు అయోడిన్ కలిసి ఉన్న ఉప్పు నమూనా, అలాగే అయోడిన్‌లేని ఉప్పు నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ అయోడిన్ ఉప్పు ప్రతినిత్యం ఉపయోగించడం వల్ల మెదడు పనితీరు చురుకుగా అవుతుందని అన్నారు. పిల్లల్లో శారీరక ఎదుగుదలకు దోహద పడుతుందన్నారు. ప్రతీ రోజు విధిగా వంటకాల్లో తప్పనిసరిగా అయోడిన్ తగిన మోతాదులో వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.స్వాతి, ఉపాధ్యాయులు సరిత, సనీత, సంధ్యారాణి, ప్రవీణ్‌కుమార్, శిరీష, యమున, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద గుట్టకు నిప్పు పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు..

**ప్రజాపక్షం/నర్సింహులపేట:**నర్సింహులపేట మండల కేంద్రంలోని పెద్దగుట్ట(ఇంద్రకీలాద్రి)కు గుర్తుతెలియని వ్యక్తులు శనివారం నిప్పుపెట్టారు.పెద్దగుట్ట పరిసర ప్రాంతల్లో మద్యం తాగడానికి వచ్చిన కొందరు మద్యం సేవిస్తూ,సిగరెట్లు కాల్చి పడేయడం వల్లనే గుట్టకు నిప్పు అంటుకోవచ్చునని పరిసర రైతులు ఆరోపిస్తున్నారు.ప్రతి శనివారం మండల కేంద్రంలో వెంకటేశ్వర స్వామి జాతర జరుగుతుంది.దీంతో పాటు మార్చి నెలలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుంది.ఈ తరుణంలో ఇలా గుట్టకు నిప్పు అంటుకోవడం పట్ల భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.కాగా విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది సంఘటన స్థలాని చేరుకొని మంటలు ఆర్పారు.ఇటీవల గుట్ట పరిసర ప్రాంతల్లో మందుబాబులు మద్యం సేవించడంతో పాటు అనేక అసాంఘిక కార్యకలపాలకు అడ్డగా మార్చుకున్నారని సంబంధిత అధికారులు అటు వైపు నిఘా పెంచాలని పరిసర రైతులు వేడుకుంటున్నారు.

## దామరవంచ గురుకులంలో వార్షిక వేడుకలు

**ప్రజాపక్షం/గూడూరు:**మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ గ్రామంలో ఉన్న టీజీటీ డబ్ల్యు యు ఆర్ జెసి బాయ్స్ గురుకుల పాఠశాలలో శనివారం ఘనంగా అన్యువల్ డే వేడుకలు నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా తాహసిల్దార్ నాగభవాని గూడూరు సిఐ సూర్యప్రకాష్ ఎస్సై గిరిధర్‌రెడ్డి గూడూరు సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలునాయక్ హాజరై విద్యార్థుల ప్రదర్శనలను ప్రశంసించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు సమయం కొద్ది రోజులు మాత్రమే ఉంది ఇష్టంతో చదవి మండలంలో మంచి పేరు తీసురావాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రుల కలలను మీరు నిజం చేయాలని విద్యార్థులను కోరారు. ఈకార్యక్రమంలో గూడూరు ఉప్పసంచ్ చంటి స్వావి శ్రీపాల్‌రెడ్డి గురుకుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో ప్యాడ్స్, పెన్నుల పంపిణీ

**ప్రజాపక్షం/మల్హర్:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండల కేంద్రమైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు జ్యోతీశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు వీరమనేని సంపత్ రావు ఆధ్వర్యంలో 80 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు మరియు పెన్నులు పంపిణీ చేశారు. హ్యూమన్ రైట్స్ సభ్యులు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ దూడం రాజేందర్,మహిళా విభాగం అధ్యక్షురాలు మంజుల రెడ్డి, సభ్యులు తీర్రి అశోక్, ప్రసాద్, కుమార్, రాజబాబు, అశోక్, నాగరాజు, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## మురళీధర్ రావును కలిసిన బిజెపి కౌన్సిలర్లు

**ప్రజాపక్షం/నర్సాపూర్:**నర్సాపూర్ నియోజకవర్గానికి వచ్చిన బిజెపి మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మధ్యప్రదేశ్ ఇన్చార్జి మురళీధర్ రావు ను శనివారం నర్సాపూర్ మున్సిపాలిటీ నుంచి బిజెపి పార్టీ తరపున నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, కౌన్సిలర్లు నిరంజన్ దాస్, శ్రీకాంత్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మురళీధర్ రావు బిజెపి పార్టీ నుంచి నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను అభినందించారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/కొల్చారం:**రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి స్పష్టం చేశారు. శనివారం నాడు మండల పరిధిలోని అంసాన్ పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, రైతులు పంటలకు రసానిక ఎరువుల వాడకం తగ్గించినట్లయితే భూసారంలో పంట దిగుబడి పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కన్నెబోయిన గీత రమేష్, ఉప సర్పంచ్ మన్నె నాగరాజ్, ఏఈఓ స్రవంతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సామర్థ్య వికాసంపై శిక్షణ

**ప్రజాపక్షం/కొల్చారం:**కొల్చారం మండల పరిధిలోని ఎనగండ్ల రైతు వేదిక లో శనివారం రైతులకు ఆత్మ సౌజన్యంతో రైతుల సామర్థ్య వికాసం, నైపుణ్య అభివృద్ధి మరియు మద్దతు సేవలు" శిక్షణ కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏకలవ్య ఫౌండేషన్ మెదక్ రీజనల్ ఆఫీసర్ చంద్రశేఖర్, కౌడిపల్లి డివిజన్ ఏడిఏ పుణ్యవతి, ఎనగండ్ల క్లస్టర్ ఏఈఓ అంబిక, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ అధికారి, సర్పంచ్ కోరబోయిన లక్ష్మి పెంటయ్య, ఉప సర్పంచ్ గోపాల్ గౌడ్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం

### జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**ప్రజాపక్షం /సంగారెడ్డి :**మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపి వేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఫిబ్రవరి 23వ తేది (సోమవారం ) నుండి యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



## నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:**మండలం పరిధిలో గల 16 గ్రామపంచాయతీల నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు సోమవారం నుండి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వేద ప్రకాశ్ రెడ్డి పత్రికా విలేకరులకు తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలోని గ్రామపంచాయతీలకు నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లకు ఫిబ్రవరి 23 నుండి మెదక్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. మండలంలోని కస్తూరిబా జూనియర్ కళాశాలలో వార్డు సభ్యులకు రెండు బ్యాచ్లు చేసి మొదటి బ్యాచి ఫిబ్రవరి 23 నుండి అల్లాదుర్గం, అప్పాజీపల్లి, గడి పెద్దాపూర్, కాగితంపల్లి, రాంపూర్, రెడ్డిపల్లి, సీతానగర్, వెంకట్రావ్ పేట్, గ్రామాల వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని రెండవ బ్యాచ్ మార్చి మూడు నుండి ఏడు వరకు బహిరన్ దిబ్బ సిల్వర్ చేవెళ్ల గొల్ల కుంట తండా ముసలాపూర్ ముప్పారం మాందాపూర్ నడిమి తండా గ్రామపంచాయతీల వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అందరూ వార్డు సభ్యులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో వేద ప్రకాశ్ రెడ్డి తెలిపారు.

## షీ షటర్ బస్సు ప్రారంభం



**ప్రజాపక్షం /సంగారెడ్డి :**జిల్లాలోని పారిశ్రామిక వాడలలో మహిళల సురక్షిత ప్రయాణికి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ , సోసైటీ పర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ అండ్ న్యూలాండ్ పౌండేషన్ ఆద్వర్యంలో షీ. షటర్ల పేరుతో ఉచిత బస్సును జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా పాశమైలారం పరిశ్రమలలో విధులు నిర్వహిస్తున్న మహిళల భద్రత సురక్షిత ప్రయాణానికి సోసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ కట్టుబడి ఉందని తెలిపారు. ఎస్ ఎస్ సి ఆద్వర్యంలో న్యూలాండ్ పరిశ్రమ సహకారంతో నూతన షీషెట్టర్ల బస్సును ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలోని ప్రజల పరిశ్రమల భద్రత ట్రాపిక్ సమస్యల నియంత్రణ ,మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలను అరికట్టాలనే ఉద్దేశ్యంతో ఈ సోసైటీని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సంస్థ పోలీసు శాఖ ,కంపెనీల అనుసందానంతో పనిచేస్తోందన్నారు. మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తూ ప్రత్యేక బస్సు సౌకర్యాం అవసరమని భావించి షీషటర్ ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ బస్సు ఇస్నాపూర్, నుండి ఇంద్రకరణ్, రూట్లో రోజుకు ఉదయం నుండి సాయంత్రం నడుస్తుందని తెలిపారు. ఆ మార్గంలో ప్రయాణించే మహిళలు , పాఠశాల విద్యార్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ బస్సు జీపిఎస్ కు అనుసందానమై ఉండటంతో బస్సు ప్రస్తుత స్థానం ,సమయ వివరాలను సులభంగా తెలుసుకోవడానికి సులువుగా ఉంటుందన్నారు. ఎదైన ఆపద సమయంలో డైల్ 100 చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్సి జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, ట్రేజరర్, రమణారెడ్డి , ఇతర ఎస్ ఎస్ సి మేనేజ్ మెంట్ కమిటీ సభ్యులు ఐలా పాశమైలారం కమిటీ సభ్యులు న్యూల్యాండ్ కంపెనీ సెక్రటరీ శారద హెచ్ ఆర్ అండ్ ఐ డివి.రెడ్డి, హెచ్ ఆర్డిజిఎం సూర్య భగవాన్, న్యూల్యాండ్ పౌండేషన్ సిఎస్ ఆర్ యాదగిరి ఆడ్మిన్ నవీన్, రఘునాథ్, ప్లాంట్ హెడ్, మహేష్, జోషి తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా పెద్దమ్మతల్లి ఉత్సవాలు



**ప్రజాపక్షం/కొల్చారం:**కళ్యాణం కమనీయం పెద్దమ్మతల్లి 4వ వార్షికోత్సవం సందర్భంగా కొల్చారం మండలం రాంపూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద కల్యాణోత్సవంతో పాటు హోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముదిరాజు సంఘం సభ్యులతో పాటు గ్రామస్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం తో పాటు భక్తులు నమ్మినవారికి కోరికలనుచ్చి పెద్దమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పెద్ద ఎత్తున బోనాల ఊరేగింపు జరిపారు. అంతకుముందు సర్పంచ్ సంగమేశ్వర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అమ్మవారి దయవల్ల రాంపూర్ గ్రామం పాడి పంటతో పాటు ప్రజలు సుభిక్షంగా ఉండాలని తెలిపారు. గత మూడు రోజుల నుంచి గ్రామంలో పండగ వాతావరణం జరగడం సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు గ్రామ అభివృద్ధి తో పాటు దేవుని దయవల్ల గ్రామం సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. వందలదిమంది భక్తులతో బోనాల ఊరేగింపు కమనీయంగా మారింది. డబ్బులతో ఆటపాటలతో డీజే సౌండ్ బాక్సులు ముందు యువకులు పెద్ద ఎత్తున డ్యాన్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జంగిటి పోచయ్య, ఉప సర్పంచ్ శ్రీశైలం, ఆకుల రాజు, కోడిచనం ప్రశాంత్ ముదిరాజ్, రవి ముదిరాజ్, కృష్ణ, గంగరాజు, బాలరాజు, ఆంజనేయులు, మంగమ్మ, మంద సోమశేఖర్, నర్సింలు తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతులకు, మహిళలకు పెరటి తోటలు,పెంపకంపై అవగాహన



**ప్రజాపక్షం/నర్సాపూర్:**నర్సాపూర్ మండల పరిధిలో చిప్పల్.తుర్తి గ్రామంలోని రైతుల, ఉత్పత్తిదారుల సంఘం రైతులకు శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ కమిటీ సౌజన్యంతో గ్రామ రైతులకు పంటల్లో యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా నర్సాపూర్ డంగోరియా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమగ్ర తెగులు, పోషక నిర్వహణ, మహిళలకు పెరటి తోటల పెంపకం, వ్యవసాయ ఉత్పత్తుల తయారీ పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవి కుమార్ మాట్లాడుతూ, పంటలలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏడిఏ సంధ్యా రాణి మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంలో వస్తున్నటువంటి నూతన సాంకేతిక అంశాలు, యూరియా వాడకం తగ్గించడం, మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాల గూర్చి, భూగర్భ జలాల పరిరక్షణ కోసం సాగు నీటి వినియోగం పై అవగాహన కల్పించారు. రైతులు ఎప్పటికప్పుడు పంటల మార్పిడి చేయాలన్నారు. పంట మార్పిడి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారిణి దీపిక మాట్లాడుతూ ప్రతి మహిళ వ్యవసాయంలో కొత్త సాంకేతిక పద్ధతులను అవలంభించి,సేంద్రీయ వ్యవసాయం చేసి, విలువ ఆధారిత వ్యవసాయ పదార్థాలు ఉత్పత్తి చేసి వాటిని విక్రయించి ఉపాధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిప్పల్, తుర్తి సర్పంచ్ సుధాకర్, ఉప సర్పంచ్ కృష్ణ గౌడ్, డంగ్గోరియా సంస్థ అధికారులు మూర్తి, లక్ష్మి, ఏఈఓలు దుర్గా ప్రసాద్, తేజస్విని, రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీరు రాక తండా ప్రజల ఇబ్బందులు

### పట్టించుకొని అధికారులు

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:**అల్లాదుర్గం మండలంలోని ముప్పారం తండాకు గత వారం రోజుల నుండి మిషన్ భగీరథ త్రాగునీళ్లు అందడం లేదని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం రోజు రోజుకు మితిమీరి పోతుందని వారి పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు మిషన్ భగీరథ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం దీనికి ప్రధాన కారణమని వారు చెబుతున్నారు. గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి అధికారులు గిరిజన తండా పై ప్రత్యేక చొరవ చూపి ప్రతి రోజు ప్రజలకు త్రాగునీళ్లు అందించే విధంగా చర్యలు చేపట్టాలని తాండ ప్రజలు కోరుతున్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజాబాట

**ప్రజాపక్షం/మనోహరాబాద్:**క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకే విద్యుత్ శాఖ ప్రజాభాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఈ రాజ్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా శనివారం మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ కళ్ళకల్ గ్రామంలో విద్యుత్ అధికారులు ప్రజాబాట కార్యక్రమం చేపట్టారు. ప్రజల నుంచి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్ ఫార్మర్ చుట్టుప్రక్కల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పరిసర ప్రాంతం అంతా శుభ్రపరిచారు. అనంతరం ఏఈ రాజ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామంలో విద్యుత్ సమస్యలు ఎలాంటివి తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ బాటిల్స్ పంపిణీ చేసిన ఉపాధ్యాయురాలు

**ప్రజాపక్షం/వెల్దుర్తి:**మెదక్ జిల్లావెల్దుర్తి ప్రాథమిక పాఠశాల లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న కే. వరలక్ష్మి శనివారం పాఠశాలలో ఒకటి నుండి ఐదవ తరగతి వరకు చదువుతున్న 98 మంది విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేయడం జరిగింది. తన సొంత ఖర్చులతో సుమారు 8 వేల రూపాయలు విలువ గల వాటర్ బాటిల్స్ ఇవ్వడం అభినందనీయం అని యెల్దుర్తి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య తెలియజేశారు. విద్యార్థులు నీరు గ్లాస్ ద్వారా ఒక్కొక్కరు త్రాగేవారు వీరి ఇబ్బందులు తొలగించినందుకు ప్రత్యేకత కృతజ్ఞతలు అని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యం.సృజన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు యన్.రీనారాయ్ మరియు కే. దివ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు తగిలి గడ్డి లారీ దగ్ధం

**ప్రజాపక్షం/టేక్మాల్:**ఎల్లుపేట ప్రధాన రహదారిపై శనివారం జరిగిన ఘటనలో గడ్డి లోడుతో వెళ్తున్న లారీకి అగ్ని ప్రమాదం సంభవించగా, స్థానికుల చాకచక్యంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొల్చారం గ్రామానికి చెందిన ఏడిటి9192 నంబరు గల లారీ పశువుల మేత కోసం ఎల్లుపేట గ్రామ శివారులో 350 గడ్డి మోపులు తీసుకోని ప్రధాన రోడ్డు గుండా వెళ్తుండగా విద్యుత్ తీగ లు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే స్పందించి కర్రల సహాయంతో గడ్డిని లారీ నుంచి బయటకు తోసి వేసి మంటలు వ్యాపించకుండా అడ్డుకున్నారు. మంటలు భారీగా చెలరేగడంతో సుమారు కిలోమీటరు మేర గడ్డి మోపులు రహదారి ఇరువైపులా పడిపోవడంతో కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు లారీ డ్రైవర్ నాగరాజు తెలిపారు. ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం పాపన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## క్యాలెండర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శని వారం గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్స్ తెలంగాణ నిజామాబాద్ జిల్లా క్యాలెండర్లను అధ్యాపకులు మధుకుమార్, వైష్ణవి ఆధ్వ ర్యంలో ఆవిష్కరించి మాట్లాడారు. 2026 వాల్ క్యాలండర్‌ను ఆవిష్కరించామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండలంలోని బషీరాబాద్ పాఠశాలలో శనివారం బాసర వాస్తవ్యులు సాయినాథ్ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేసి మాట్లాడారు. గత 8 సంవత్సరా లుగా స్కూల్ విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామపంచాయతీ కార్యదర్శి, హెడ్మాస్టర్ నాగుల శ్రీనివాస్, సుంకెట రాజు, గోవర్ధన్ విద్యార్థుల తల్లిదం డ్రులు పాల్గొన్నారు.

## అన్ని సబ్జెక్టులు చదవాలి..రాయాలి..

ఇంచార్జీ కలెక్టర్ గరిమా అగ్రవాల్



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** పదోతరగతి విద్యార్థులు అన్నిసబ్జెక్టులు చదవాలి. రాయా లని రాజన్నసిరిసిల్లా జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ విద్యార్థులకు సూచించారు. ఎల్లారె డ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామం కస్తుర్బాగాంధీ విద్యాలయంలో శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఉపా ధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లు పరిశీ లించారు. కిచెన్, వంటగది, స్టోర్‌రూం భోజ నానికి వినియోగించే ఆహారపదార్థాల నాణ్యత తనిఖీ చేశారు. ఇంచార్జి కలెక్టర్ గరి మఅగ్రవాల్ మాట్లాడుతూ ప్రతివిద్యార్థిజీవి తంలో పదవతరగతి కీలకమన్నారు. విద్యా ర్థులు ప్రణాళిక రూపొందించుకుని ప్రతి సబ్జె క్టుకు గత ప్రశ్నపత్రాలు సాధన చేయాలని సూచించారు. పదోతరగతి మార్కులే ఉన్నత విద్యాభ్యాసంలో కీలకంగా మారుతాయని చెప్పారు. ఇప్పటి అంశాలే రానున్న తరగ తుల్లో మరింత విస్తృతంగా ఉంటాయన్నారు. మంచిగా చదివి ఉన్నతస్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కెరీర్‌లో స్థిరపడిన తర్వాతే మిగతా విశయాలు ఆలోచించాలని సూచ నలు చేశారు.

# గ్రామ సభలో సమస్యలపై గళమెత్తిన గ్రామస్తులు



**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామ సభ సమస్య లపై ప్రశ్నలతో కొనసాగింది. నూతనంగా ఏర్పడిన పాలక వర్గం ఆధ్వర్యంలో సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్ అధ్యక్షతన ఈ సభను ఏర్పాటు చేశారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై గ్రామస్తులు ఈ సందర్భంగా గళమెత్తారు. గ్రామ సభ ప్రారంభం కాగానే గ్రామ కార్యదర్శి ఆదాయ, వ్యయాలపై నివేదిక చదివి వినిపిం చారు. గ్రామంలోని పెండింగ్ సమస్యలపై వార్డు సభ్యులు, స్థానికులు కార్యదర్శి సందీప్‌ను నిలదీశారు. ఈ సభలో డ్రైనేజీ, రోడ్లు, జిపి కార్మికుల నియామకం, అక్రమ వెంచర్లు, రోడ్ల కబ్జా, నీటి సమస్య, కుక్కలు, కోతుల బెడద వంటి అంశాలు చర్చకు వచ్చాయి. వీటిని పరిష్కరించేం దుకు గ్రామ కార్యదర్శి సందీప్ గ్రామ సభలో తీర్మానం చేశారు. ఇదిలా ఉండగా గ్రామ ఉప సర్పంచ్ నీలం కృష్ణతో పాటు వార్డు సభ్యులో కొంతమంది ఈ గ్రామ సభకు హాజరు కాకపోవడం విశేషం. ఈ కార్యక్రమంలో అధికా రులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



**ప్రజాపక్షం/బోధన్ :** బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ స్వప్న అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా సాలూరా మండల స్థాయి గ్రామ పంచాయతీ కార్యదర్శులకు బాల్య వివాహాల నిరో ధక చట్టం 2006పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు స్వప్న మాట్లాడుతూ.. మహిళా శిశు దివ్యాం గుల, వయోవృద్ధుల శాఖ ఐసిపిఎస్, ఐసిడిఎస్ సాలూరా ఆధ్వర్యంలో కార్యదర్శులకు బాల్య వివాహాల నిరోధక చట్టంపై శిక్షణ నిర్వహించామన్నారు. బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్య నేరమని అన్నారు. మహిళా చట్టాలు, ఆపద సమయంలో ఎవరిని సంప్రదిం చాలని హెల్ప్‌లైన్ నంబర్ గురించి తదితర అంశాలపై వివ రించామన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్ వైజర్ బాబు, ఎంపిడిఒ, ఐసిడిఎస్ సూపర్ వైజర్ గంగామణి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

సర్పంచ్ నరేష్



**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శనివారం పరిస రాల పరిశుభ్రత దృష్ట్యా గ్రామంలోని మురికి నీటి కాలు వల చుట్టు, అలాగే గ్రామంలోని పరిసరా ప్రాంతాలలో సర్పంచ్ పుప్పాల నరేష్ అధ్యక్షతన బ్లీచినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు సర్పంచ్ నరేష్ మాట్లాడారు. గ్రామ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల న్నారు. చెత్తను చెత్త వాహనంలో వేయాలన్నారు. మురికి కాలువలలో నీరు నిల్వ ఉంటే ఈగలు, దోమలు ఉత్పత్తి అవుందన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపం లేకుండా తాము చర్యలు తీసుకుంటామని, ప్రజలు సైతం తమ ఇండ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహి పల్, ఉప సర్పంచ్ సదానందం గౌడ్, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆడుకుంటూ కాల్వలో పడి బాలుడి మృతి



**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కాలువలో పడి నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. గ్రామ సమీపంలోని నిజాం సాగర్ కెనాల్ వద్ద హఫీజ్ అనే బాలుడు తన మిత్రులతో కలిసి ఆడుకుంటు న్నాడు. ఈ క్రమంలో ఆకస్మాత్తుగా కాలువలో పడిపో యాడు. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, నీటి ఉధృతి ఎక్కు వగా ఉండటంతో బాలుడు ప్రవాహంలో కొట్టుకుపో యాడు. తరువాత గ్రామ శివారులో బాలుడి మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. స్థానికులు మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించారు. అప్పటి వరకు కళ్లముందే ఆడుకున్న చిన్నారి ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాలుని కుటుంబీకుల రోధ నలు మిన్నంటాయి. ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కొలువుదీరిన మున్సిపల్ నూతన పాలకవర్గం

**ప్రజా పక్షం/ వేములవాడ :** వేములవాడ మున్సిపల్ నూతన చైర్మన్‌గా పుల్కం రాజు, వైస్ చైర్మన్‌గా నరాల శేఖర్ బాధ్యతలను స్వీకరించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజర య్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత నూతన పాలకవర్గంపై ఉందని అన్నారు. ప్రజలు ఎన్నో ఆశలతో మనకు అధికారాన్ని కట్టబెట్టారని, వారి నమ్మ కాన్ని వమ్ము చేయకుండా పారదర్శకమైన, అవినీతి రహిత పాలనను అందించాలని ఆయన సూచించారు. చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ మాట్లాడుతూ. తమపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధిష్టానానికి, తమను గెలిపించిన వేములవాడ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వేములవాడను రాష్ట్రంలోనే అత్యు త్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయ కులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## వెనుకబడ్డ విద్యార్థులపై శ్రద్ధ పెట్టాలి

సబ్ కలెక్టర్ వికాస్ మహతో



**ప్రజాపక్షం/బోధన్ :** చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శని వారం బోధన్ మండలం చెక్కి క్యాంప్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశా లను సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. ఈ మేరకు విద్యార్థుల స్కిల్స్‌ను ఆయన పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై శ్రద్ధ పెట్టి, వారిని ఇంప్రూవ్ చేయాలని సూచించారు. ఆయన వెంట స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## స్పోర్ట్స్ యూనిఫామ్ పంపిణీ




**ప్రజాపక్షం/బోధన్ :** బోధన్ పట్టణంలోని నాల్గవ వార్డు నర్సా పూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల గ్రామ వాసి వార్డ్ కౌన్సి లర్ సమీనా మన్నన్ పాఠశాలలోని విద్యార్థులకు స్పోర్ట్స్ యూని ఫామ్‌కు రూ. 20వేలను విరాళంగా అందచేశారు. ఈ యూనిఫా మ్‌లను కౌన్సిలర్ తన చేతుల మీదుగా శనివారం విద్యార్థులకు అందచేశారు. ఈ మేరకు ఎంఇఒ శాలువాతో ఘనంగా సన్మా నించి కౌన్సిలర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పత్తి అశోక్, రమావత్ మధు, ఉస్మాన్, జాదవ్ ప్రవీణ్ నాయక్, షేక్ మహబూబ్ బండి సలీం, సాయికృష్ణ, పాఠశాల హెచ్‌ఎం గంగాధర్, అంగన్‌వాడీ టీచర్ విజయ, స్కూల్ చైర్మన్ ఎడ్ల విజయ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చైర్‌పర్సన్ దంపతులకు సన్మానం



**ప్రజాపక్షం/బోధన్ :** బోధన్ పట్టణంలో తూము పద్మశరత్ రెడ్డి రెండవ సారి మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నికైన శుభ సందర్భంగా శనివారం బోధన్ ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్షుడి ఆధ్వ ర్యంలో చైర్ పర్సన్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు చైర్ పర్సన్ తూము పద్మశరత్ రెడ్డి కి పుష్పగుచ్చ మిచ్చి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా అధ్యక్షులు కారం స్వామి, గౌరవ అధ్యక్షులు బలరాం రాజు, రవి, ఉపాధ్యక్షులు రాజేష్, కార్యదర్శి కృష్ణ, సాయిలు, వినాయక్ రాజు, లక్ష్మ ణ్, అశోక్, రమేష్, రాజశేఖర్, సమీర్, జగన్, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాలకు కడవలు సిద్ధం



**ప్రజాపక్షం/నందిపేట్:** నందిపేట్ మండలం అయిలాపూర్ గ్రామంలో నేడు మహాలక్ష్మి అమ్మవారి బోనాలు తీస్తారు. ఇందు కోసం పద్మశాలి సంఘంవారు బోనాల కడవలు సిద్ధం చేశారు. స్థానిక సంఘం నుంచి కడలు మహాలక్ష్మి ఆలయం వరకు ర్యాలీగా తీస్తారు.